## మన(సు)లో మాట

అందరూ ఆయురారోగ్యైశ్వర్యవిద్య ఆనందముతో, ఆదాయ-వ్యయములు, రాజపూజ్య-అవమానములు అనుకూలమైన రీతిలో దోహదపడుతుండగా విరోధి నామ సంవత్సరము శుభప్రదమవ్వాలని సంఘమిత్ర శుభాకాంక్షలను తెలియజేస్తోంది. చాలా మంది పాఠకులవద్దనుండి ఉగాది శుభాకాంక్షలు అందాయి. వారి అభిమానమునకు కృతజ్ఞతలు. చాలామంది పాఠకులు 'నా స్మృతి పథంలో ఒకరోజు', 'జనపథం - జనపదం', 'ఆచారములు - అంతరార్థములు', సామెతకథలు, సమస్యల'తోరణం', చరిత్రకెక్కిన చరితార్థులు మొదలైన అంశములు బాగున్నాయని తెలియజేసారు. తృప్తినిస్తున్న విషయం! ఈ సంచిక అనివార్య కారణములవలన చాలా ఆలస్యమైనది. పాఠకులు మన్నిస్తారని భావిస్తున్నాము.

వేదగణిత పద్ధతులను నేర్చుకోడానికి పలుచోట్ల చూపిస్తున్న ఆదరణకి చాలా ఆనందం కలుగుతున్నది. భారతీకృష్ణతీర్థస్వామీజీ మనకి అందించిన అమూల్యమైన ఆ ఆస్తిని మన తరువాత తరములవారికైనా అందించి తృప్తిని పొందవలెననే మా ఆశయము, గురు కృపవలన కార్యరూపము దాల్చుతున్నందుకు కలిగే మానసికానందము మాటలలో వ్యక్తీకరించలేనిది. ఈ సంవత్సరములో వేదగణిత సూత్రములను నలుగురితో పంచుకోవాలని, సంఘమిత్ర మే నెలలో కాలిఫోర్నియాలోని లాస్ఏంజల్స్ మరియు శాన్‌ఫ్రాన్‌సిస్కో నగరములలో తరగతులు నిర్వహించడానికై సన్నాహములు చేస్తున్నది. ఈ తరగతులు నిర్వహించడానికి కావలసిన సదుపాయములను కలుగజేస్తున్న మిత్రులకు సంఘమిత్ర ధన్యవాదములు తెలియజేస్తున్నది. తరువాత జూన్ - జులై నెలలలో విశాఖపట్నము, చుట్టుప్రక్కల గ్రామములలో వేదగణితమునకు సంబంధించిన తరగతులు నిర్వహించవలెనని ప్రయత్నము చేస్తున్నది. వివరములకు సంఘమిత్రను సంప్రదించవచ్చు.

మార్చి 14వ తేదీన సంఘమిత్ర 'శ్రీనివాస రామానుజన్ మేథమేటిక్స్' ఆధ్వర్యములో మొట్టమొదటిసారి గణితశాస్త్ర బోధన పద్ధతులపై ఒక సదస్సును (మేథమేటిక్స్ సెమినార్‌ను) నిర్వహించింది. నాలుగు పదులకు పైన హాజరైన ప్రేక్షకులు ఈ కార్యక్రమమును అభినందిస్తూ, ఇలాంటి సదస్సులను తరచుగా ఏర్పాటు చేస్తే ఎంతోమందికి ఉపయుక్తముగా ఉంటుందని తెలియజేసారు. అలాగే మార్చి 28వ తేదీన 'శ్రీనివాస రామానుజన్ మేథమేటిక్స్' ఆధ్వర్యములోనే '***మేధావధానము 2009*** కార్యక్రమము నిర్వహించబడింది. 2 వారముల వ్యవధిలో నిర్వహించడము కారణముగా ఎక్కువ మందికి ఆహ్వానములు పంపించే అవకాశము కుదరలేదు. ఈ అవధానమునకు సుమారు 50 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. ఎనిమిది మంది పిల్లలు కేవలం 5 గంటలలో నేర్చుకున్న గణిత పద్ధతులను, ఎలాంటి గణన యంత్రముగాని, కాగితము-కలముగాని ఉపయోగించకుండా ఈ అవధానములో ప్రేక్షకుల ప్రశ్నలకు త్వరితగతిని సమాధానములు చెప్పి ప్రశంసలను పొందారు.

మళ్ళీ జులై సంచికలో కలుద్దామా! అంతవరకు సెలవు. అభినందనలతో ...

సంఘమిత్ర సంపాదక వర్గం.